



ప్రాజెక్టు వద్ద సెల్ఫీ దిగుతున్న సందర్శకులు

యాక్షన్‌ప్లాన్ రెడీ

- స్వచ్ఛదనం.. పచ్చదనంలో భాగంగా ఐదు రోజుల షెడ్యూల్
- గ్రామ పంచాయతీలు.. పురపాలికల్లో కార్యక్రమాలు
- ప్రజలకు మెరుగైన సేవలే లక్ష్యం
- ఇప్పటికే ప్రత్యేక అధికారులు, వార్డు ఆఫీసర్లకు అవగాహన



మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో పారుతున్న డ్రైనేజీ, తాగునీటి ట్యాంకు

మహబూబ్‌నగర్, ఆగస్టు 3: ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఐదు రోజుల యాక్షన్ ప్లాన్‌కు అధికార యంత్రాంగం శ్రీకారం చుట్టింది. స్వచ్ఛదనం-పచ్చదనం పేరుతో ఈనెల ఐదో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఉమ్మడి పాలమూరులోని గ్రామాలతోపాటు 19 పురపాలికలలో అమలు చేయనున్నారు. ఇప్పటికే ఆయా జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు కార్యక్రమాలపై యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌లు, మండల పరిషత్‌లలో ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జిల్లా పరిషత్ సభ్యుల పదవీ కాలం ముగిసినందున ప్రత్యేక అధికారులు ఈ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, మునిసిపల్ చైర్మన్‌లు, కమిషనర్‌లు, వార్డు ఆఫీసర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాలమూరు జిల్లాలో ఇప్పటికే వార్డు ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటుచేయగా, శనివారం జిల్లాలోని మూడు మునిసిపాలిటీల అధికారులు, చైర్మన్‌లతో అదనపు కలెక్టర్



మహబూబ్‌నగర్ మునిసిపల్ కార్యాలయం

సమావేశమై కార్యక్రమ ఉద్దేశాన్ని వివరించారు.

5న ర్యాలీలు.. అవగాహనలు

ఈనెల ఐదో తేదీన స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, యూత్, వార్డు కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి, ర్యాలీలు చేపట్టాలి. వీధి కుక్కల బెడదపై ఐఈసీ క్యాంపెయిన్ నిర్వహించాలి. ఇంటిస్థాయిలో చెత్తను వేరుచేసే కార్యక్రమాలపై అవగాహన కల్పించాలి. వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రసంగాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, పీహెచ్‌సీలు, బస్టాప్‌లను శుభ్రం చేయాలి. గ్రామీణ ప్రాంతాలలో వ్యక్తిగత మరుగుదొడ్లు లేకుంటే గుర్తించి, 15 రోజుల్లో నిర్మించాలి. ఇళ్ల ముందు, పబ్లిక్ ప్రాంతాలలో మొక్కలు నాటి, వాటికి తమకు ఇష్టమైన పేర్లు పెట్టుకుని సంరక్షించుకునే బాధ్యత తీసుకోవాలి.

6న తాగునీరు.. వర్షపు నీటి సంరక్షణ

ఆరో తేదీన తాగునీరు, వర్షపు నీటి సంరక్షణపై అవగాహన కల్పించాలి. అన్ని తాగునీటి వనరులను శుభ్రం చేయాలి. రోజూ క్లోరినేషన్ చేయాలి. నీటి సరఫరాలో కనీసం మూడు పాయింట్ల వద్ద టెస్టింగ్ కిట్‌లతో పరీక్షించాలి.

7న కాలువలను శుభ్రం చేయాలి

ఏడో తేదీన డ్రైనేజీలు, గుంతలలో నిలిచిన నీటిని బయటకు పంపించాలి. నీరు నిలిచిపోయే అన్ని మురికి ప్రాంతాలను, లోతట్టు ప్రాంతాలను గుర్తించి, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి. నీటి ట్యాంక్‌లు, చేతిపంపుల దగ్గర నీరు ఆగకుండా కమ్యూనిటీ సోక్‌పిట్‌లను ఏర్పాటు చేయించాలి. ప్రభుత్వ సంస్థలు, ప్రజా స్థలాలను శుభ్రం చేయాలి.

8న ఆరోగ్యం, వీధికుక్కల బెడదపై..

ఎనిమిదో తేదీన మహిళా సంఘాలు, ఆశా కార్యకర్తలు డెంగ్యీ మలేరియాపై పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించాలి. సీజనల్ వ్యాధుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలి. దోమలు వృద్ధి చెందకుండా నిరోధించడానికి ఆయిల్‌బాల్స్‌ను నీటి కొలనులో వదలాలి. రోజూ ఫాగింగ్ జరిగేలా చూడాలి. మనుషులపై దాడి చేస్తున్న కుక్కలను గుర్తించాలి. వాటికి జిల్లా పశువైద్యశాల, జంతు జనన నియంత్రణ కేంద్రాలలో స్టెరిలైజేషన్ చేసేలా చర్యలు తీసుకోవాలి.

9న ప్రభుత్వ సంస్థలు, స్థలాలను శుభ్రపరచాలి

కార్యక్రమంలో చివరి రోజు తొమ్మిదిన స్థానిక, పట్టణ సంస్థలలోని అన్ని గృహాలలో శుక్రవారం డ్రైడే పాటించాలి. ఇంటి ఆవరణలో నిలిచిన నీటిని క్లియర్ చేయాలి. అన్ని కార్యాలయాలలో టీ కప్పులు, షూ, సీసాలు, టైర్లు, కంటైనర్లు శుభ్రం చేయాలి. శిథిలమైన భవనాలు, గోడలను తొలగించాలి. రోడ్డు పక్కన కుళ్లిపోయిన, చనిపోయిన చెట్లు, కొమ్మలను తొలగించాలి. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, వాటర్ ట్యాంక్‌ల పైకప్పులను శుభ్రం చేయాలి.

సామూహిక సెలవులు ఇవ్వండి

- స్వచ్ఛదనం-పచ్చదనం చేపట్టలేం
- జోగుళాంబ గద్వాల జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల వినతి

గద్వాల: ప్రభుత్వం ఈ నెల ఐదో తేదీ నుంచి తొమ్మిదో తేదీ వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్ఛదనం కార్యక్రమాన్ని నిర్వహించలేమని, తమకు సామూహిక సెలవులు మంజూరు చేయాలని పంచాయతీ కార్యదర్శులు ఆయా మండలాల ఎంపీడీవోలకు వినతి పత్రాలు అందించారు. శనివారం అన్ని మండల కేంద్రాల్లో కార్యక్రమంపై పచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సమస్యలను తెలిపారు. పంచాయతీలకు నిధులు లేకపోవడంతో కార్మికులకు జీతాలు ఇవ్వలేదని, దాంతో వారు వీధులు, డ్రైనేజీలు శుభం చేయానికి ముందుకు రావడం లేదని చెప్పారు. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లలేని పరిస్థితిలో పంచాయతీలు ఉన్నాయన్నారు. ఇప్పటికే పరిశుభ్రతతో పాటు మంచినీటి సరఫరా, విద్యుత్ బల్బుల కోసం తమ చేతి నుంచి డబ్బులు ఖర్చు చేశామని తెలిపారు. మరోవైపు జిల్లా అధికారులతో పాటు ప్రజా ప్రతినిధులు తమను వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర చరిత్రలో మొదటి సారి 255 మంది మంది కార్యదర్శులను ఒకేసారి బదిలీ చేశారన్నారు. అందులో 60 మందికిపైగా కార్యదర్శులు పరస్పర అంగీకారంతో బదిలీ కావడానికి సిద్ధంగా ఉన్నా.. అధికారులు ఇచ్చిన మాట నెరవేర్చడం లేదన్నారు.



గద్వాల ఎంపీడీవోకు వినతి పత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు



శ్రీశైలం ప్రాజెక్టు పది గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

శ్రీశైలానికి పోటెత్తిన పర్యాటకులు

- ప్రాజెక్టు పది గేట్ల ఎత్తివేత
- రద్దీగా మారిన శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారి

దోమలపెంట ఆగస్టు 3: శ్రీశైలం ప్రాజెక్టుకు పర్యాటకులు శనివారం పోటెత్తారు. ప్రాజెక్టు పది గేట్లను ఎత్తడంతో చూసేందుకు తరలొస్తున్నారు. తెలంగాణతో పాటు కర్నాటక, మహారాష్ట్రల నుంచి పర్యాటకుల రాకతో శ్రీశైలం-హైదరాబాద్, శ్రీశైలం-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారులు రద్దీగా మారాయి. ఘాట్ రోడ్డు ఇరుకుగా ఉండటం, బైకులు, కార్లు డ్యాం సమీపంలో రోడ్డుకు అడ్డదిడ్డంగా నిలపడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. శ్రీశైలం నుంచి దోమలపెంట వరకు 25 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాలంటే నాలుగు గంటలకుపైగా సమయం పడుతోంది. ట్రాఫిక్‌ను క్లియర్ చేసేందుకు పోలీసులు నిత్యం శ్రమిస్తున్నారు.



డ్యాం వద్ద సందర్శకుల కిటకిట

కిలో మీటర్ల మేర నిలిచిన వాహనాలు

మన్ననూర్: శ్రీశైలం ప్రాజెక్టును చూసేందుకు పర్యాటకుల రాకతో మన్ననూరు, దోమలపెంట అటవీ చెక్‌పోస్టుల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు మూడు వేలకుపైగా వాహనాలు శ్రీశైలం వెళ్లాయని, రూ. మూడు లక్షలకుపైగా అటవీశాఖకు ఆదాయం లభించిందని టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. పర్యాటకుల రద్దీ కారణంగా మన్ననూరు, వటవర్లపల్లి, దోమలపెంట గ్రామాల్లోని పర్యాటక కాటేజీలు నిండిపోయాయి. హోటళ్లు, చిరు వ్యాపారులకు వ్యాపారం బాగా జరిగింది. ఆదివారం రద్దీ మరింత పెరుగనుంది.



ఘాట్ రోడ్డులో నిలిపిన వాహనాలు



మన్ననూరు చెక్‌పోస్టు వద్ద నిలిచిన వాహనాలు



విద్యార్థినులు పారబోసిన పురుగుల అన్నం

పురుగుల అన్నంతో అస్వస్థత

- అనారోగ్యానికి గురైన 20 మంది మోడల్ స్కూల్ హాస్టల్ విద్యార్థినులు
- కడుపునొప్పితో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స
- తాగడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికి నీళ్లు కరువు
- పట్టించుకోని హాస్టల్ ఇన్‌చార్జి
- కొంత మందిని ఇళ్లకు తీసుకెళ్లిన తల్లిదండ్రులు

వెల్దండ, ఆగస్టు 3: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ వసతి గృహంలో నాసిరకం భోజనంతో శనివారం 20 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వసతి గృహంలో కొన్ని రోజులుగా అన్నం బాగుండటం లేదని, అన్నంలో పురుగులు వస్తున్నాయని చెబుతున్నారు. రెండు రోజులుగా భోజనం సరిగా చేయకపోవడంతో కడుపునొప్పి బారిన పడ్డారు. స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో వారికి చికిత్స చేయించారు. ఇంత జరుగుతున్నా వసతి గృహ ఇన్‌చార్జి, నిర్వాహకులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు విమర్శిస్తున్నారు. దీంతో కొంతమంది విద్యార్థులను తల్లిదండ్రులు తమ ఇళ్లకు తీసుకెళ్లారు. తాగడానికి, కాలకృత్యాలు తీర్చుకోడానికి నీళ్లు సరిగా లేవని, మరుగుదొడ్లకు తలుపులు పాడయ్యాయని చెప్పారు. విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు శనివారం హాస్టల్‌ను సందర్శించారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఎత్తిపోసింది.. 2.7 టీఎంసీలే

- నెట్టెంపాడు ఎత్తిపోతల కింద నీటి నిల్వ సామర్థ్యం 11 టీఎంసీలు
- వివిధ కారణాల వల్ల ఏటా 6.6 టీఎంసీలే నిల్వ
- ఫలితంగా పూర్తి స్థాయి ఆయకట్టుకు అందని నీరు



ర్యాలంపాడు రిజర్వాయర్

గద్వాల, ఆగస్టు 3: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద మొత్తం 11 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం గల రిజర్వాయర్లు ఉండగా, వివిధ కారణాల వల్ల 6.6 టీఎంసీల నీటినే నిల్వ చేస్తున్నారు. దాంతో రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాల్సి ఉండగా, 1,43,000 ఎకరాలకు మాత్రమే నీరందిస్తున్నారు. అందుకు 99వ, 100వ ప్యాకేజీ కాలువ పనులు పూర్తి కాకపోవడం, చిన్నోనిపల్లి రిజర్వాయర్‌లో నీళ్లు నింపే పరిస్థితి లేకపోవడం 2019 నుంచి ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీల కారణంగా నాలుగు టీఎంసీల నుంచి రెండు టీఎంసీలకే పరిమితం చేయడం, చిన్నోనిపల్లి గ్రామాన్ని ఖాళీ చేయించకపోవడంతో అక్కడి రిజర్వాయర్‌లో నిల్వ చేయాల్సిన 1.5 టీఎంసీలను కూడా ఉపయోగించుకోలేక పోవడం, సంగాల రిజర్వాయర్‌ను నింపడానికి లింక్ కాలువ లేకపోవడంతో ఇక్కడ 0.6 టీఎంసీలను వాడుకోలేకపోవడం వంటివి కారణాలుగా ఉన్నాయి.

ఒక మోటారుతోనే ఎత్తిపోత

జూరాలకు వరదలు ప్రారంభం అయిన వెంటనే జూన్ 13వ తేదీన నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం మోటార్లను ఆన్ చేశారు. మొదట ఒక మోటారుతో ప్రారంభించి, ఆ తర్వాత రెండు మోటార్లతో రోజూ 1,500 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. ఇప్పటి వరకు 2.7 టీఎంసీల నీటిని ఎత్తిపోశారు. అందులో గుడ్డెందొడ్డి రిజర్వాయర్‌కు 0.6 టీఎంసీలు, ర్యాలంపాడుకు 1.6 టీఎంసీలను తరలించారు. అయితే ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి కాలువలతో పాటు తాటికుంట, ముచ్చోనిపల్లి, నాగర్‌దొడ్డి రిజర్వాయర్లకు నీటిని విడుదల చేస్తున్నారు. ర్యాలంపాడును ఖాళీ చేస్తేనే జూరాల నుంచి నిర్ణయించిన మేర నీటిని తీసుకునే అవకాశం ఉంటుంది. అయితే జూరాల నుంచి ఇప్పటి వరకు రెండు మోటార్లతో నీటిని పంపింగ్ చేయగా.. ప్రస్తుతం రిజర్వాయర్ 1.6 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయర్ సామర్థ్యం రెండు టీఎంసీలే కావడంతో ఒక మోటారును ఆఫ్ చేసి, 750 క్యూసెక్కుల నీటినే ఎత్తిపోస్తున్నారు. ఈ రిజర్వాయర్ నుంచి తాటికుంట రిజర్వాయర్ 1.5 టీఎంసీల సామర్థ్యానికి గాను 0.5 టీఎంసీలు, ముచ్చోనిపల్లి సామర్థ్యం 1.5 టీఎంసీలకు గాను 0.17 టీఎంసీలు, నాగర్‌దొడ్డి సామర్థ్యం 0.6 టీఎంసీలకు గాను 0.25 టీఎంసీలు ఎత్తిపోశారు. అయితే గుడ్డెందొడ్డి, ర్యాలంపాడు, తాటికుంట, ముచ్చోనిపల్లి, నాగర్‌దొడ్డి అన్ని రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నింపితే 6.6 టీఎంసీలే అవుతాయి. అయితే వీటిని నింపడానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఆలోపు జూరాలకు వరద తగ్గితే నీటిని నింపుకోలేని పరిస్థితి ఏర్పడింది. అయితే వర్షాకాలం ఇంకా ఉండటంతో వరద వచ్చే అవకాశం ఉంది. 6.6 టీఎంసీలతో వానా కాలానికి 1,43,000 ఎకరాలకు నీరందిస్తామని ఇరిగేషన్ అధికారులు అంటున్నారు. వర్షాలు వస్తుండటంతో రిజర్వాయర్ల ద్వారా నీటి వినియోగం ఉండదు కాబట్టి పూర్తి స్థాయి ఆయకట్టుకు నీరందిస్తామని చెబుతున్నారు.

వరదలు ఉన్నంత వరకు ఎత్తిపోస్తాం

కృష్ణానదికి వరదలు వస్తున్నంత వరకు నీటిని ఎత్తిపోస్తాం. నిర్ణయించిన సాగు 1,43,000 ఎకరాలకు నీరందిస్తాం. ర్యాలంపాడులో 1.6 టీఎంసీలు నింపి, తర్వాత బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, సాగు కాలువలకు నీటిని విడుదల చేశాం. ఇప్పటి వరకు 2.7 టీఎంసీలను ఎత్తిపోశాం. ఇది ఇలానే కొనసాగుతుంది. యాసంగికి నీటి విడుదలను ఆ సమయంలో జూరాలకు వచ్చే వరదలను బట్టి నిర్ణయిస్తాం.

- రహీముద్దీన్, ఈఈ, జూరాల

యాసంగికి నీరిచ్చేరా?

నెట్టెంపాడు ప్రాజెక్టు కింద వానాకాలంలోనే 1,43,000 ఎకరాలకు సాగునీరు అందించడం కష్టంగా మారింది. ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీలతో నిల్వ సామర్థ్యం నాలుగు నుంచి రెండు టీఎంసీలకు తగ్గించడం, ముచ్చోనిపల్లి రిజర్వాయర్ నుంచి కూడా సీఫేజ్ వాటర్ ఉండటంతో నీటిని నిల్వ చేసుకోవడం కష్టంగా మారింది. వర్షాకాలంలో జూరాల నుంచి రిజర్వాయర్లకు 10 టీఎంసీల నీటిని ఎత్తిపోస్తేనే పంటల సాగు సులభం అవుతుంది. ఆ తర్వాత యాసంగికి కూడా అంతే నీటి నిల్వలు ఉండాలి. కానీ ఎత్తిపోయడానికి కృష్ణానదికి వరదలు ఉండటం లేదు. అందుకే గత మూడేళ్లుగా ఇరిగేషన్ అధికారులు క్రాప్ హాలిడేను ప్రకటిస్తున్నారు. ఈ ఏడాదీ అదే పరిస్థితి ఉండే అవకాశం ఉంది.

గరిష్ఠంగా ఎత్తిపోసింది 12 టీఎంసీలే

నెట్టంపాడు చరిత్రలో 2022లో గరిష్ఠంగా ఎత్తిపోసింది 12 టీఎంసీలే. ఏటా ఎనిమిది నుంచి 10 టీఎంసీలకు మించడం లేదు. నెట్టంపాడుకు జూరాల ప్రాజెక్టు నుంచి 21.45 టీఎంసీలను వినియోగించుకునే హక్కు ఉంది. కానీ ఇప్పటి వరకు ఎప్పుడూ పూర్తి స్థాయిలో నీటి వినియోగం జరగలేదు. దానికి కారణం ర్యాలంపాడును నాలుగు టీఎంసీల నుంచి రెండు టీఎంసీలకు కుదించడం. అదేవిధంగా చిన్నోనిపల్లి, సంగాల రిజర్వాయర్లు వినియోగంలోకి రాకపోవడం, 57 వేల ఎకరాలకు నీరందించే 99, 100 ప్యాకేజీల కాలువలు పూర్తి కాకపోవడం, ఎత్తిపోయడానికి వరదలు రాకపోవడం వంటివి కారణాలుగా ఉన్నాయి.



నెట్టెంపాడు నుంచి ర్యాలంపాడుకు విడుదలవుతున్న నీరు

కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ

- పీఏసీఎస్ ఎరువుల దుకాణం ప్రారంభంలో వాగ్వాదం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

నర్వ, ఆగస్టు 3: నారాయణపేట జిల్లా నర్వలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎరువులు, మందుల దుకాణం ప్రారంభంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు బాహాబాహీకి దిగారు. శిలాఫలకంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడి పేరు పెట్టడంపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత వహించారు. సభ ప్రారంభంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి కల్పించుకొని శిలాఫలకంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడి పేరు ఎందుకు పెట్టారని?, ఎమ్మెల్సీ పేరు ఎందుకు పెట్టలేదని అడిగారు. ఇరు వర్గాలు వాగ్వాదం చేసుకుంటుండగా పోలీసులు కల్పించుకొని సద్దుమణిగింపజేశారు. అనంతరం ఎంపీ అరుణ మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసమే సహకార సొసైటీ సంఘాలు పని చేయాలని చెప్పారు. ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా ఉండి మండలాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు రుణమాఫీ చెక్కులను అందించారు.

శిలాఫలకాన్ని ప్రారంభించని ఎంపీ

అంతకు ముందు ఎరువుల దుకాణాన్ని ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఎంపీ ప్రారంభించకపోవడంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. శిలాఫలకంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడి పేరు ఉన్నందుకే.. మీ నాయకుల మాటలు విని, బీసీలపై వివక్ష చూపుతున్నారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ లక్ష్మన్న, కార్యదర్శి ఉదయ్, డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, వివేక్‌రెడ్డి, పల్లె శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండయ్య, సోమ శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్య సాగర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, సాగర్ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నం

- గ్యాస్ కట్టర్‌తో మిషన్ ధ్వంసం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ, సీఐ

గండీడ్, ఆగస్టు 3 : ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీకి యత్నించిన దుండగులు తమ ప్రయత్నం విఫలం కావడంతో పారిపోయిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ఏటీఎంలోకి మాస్కులు వేసుకొని ఇద్దరు దుండగులు ప్రవేశించారు. సీసీ కెమెరాలకు నల్లటి కలర్‌ను స్ప్రే చేశారు. తర్వాత గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను కట్ చేశారు. ఆ సమయంలో పెట్రోలింగ్ పోలీసుల రాకను గమనించి వెంటనే అక్కడ్నుంచి పరారయ్యారు. ఉదయం ఏటీఎంను పరిశీలించిన బ్యాంకు మేనేజర్ శరత్‌చందర్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్, క్లూస్‌టీమ్ సీఐ రాజేందర్, హన్వాడ, నవాబ్‌పేట ఎస్సైలు వెంకటేష్, విక్రమ్ పరిశీలించారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఏటీఎంలో రూ.13 లక్షల వరకు నగదు ఉందని మేనేజర్ చెప్పారు.



ధ్వంసం చేసిన ఏటీఎం మిషన్

ఐటీఐలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ జారీ

వనపర్తి రూరల్, ఆగస్టు 3 : వనపర్తి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి గాను సంబంధిత కోర్సుల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి మూడో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వనపర్తి జిల్లా కన్వీనర్, ఐటీఐ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థినీ, విద్యార్థులు వైబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో లోతైన విచారణ

- పోలీసుల అదుపులో పదుల సంఖ్యలో నిందితులు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న కుటుంబ సభ్యులు

వనపర్తి క్రైం, ఆగస్టు 3 : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వనపర్తి జిల్లా చిన్నంబావి మండలం లక్ష్మీపల్లి గ్రామంలో శ్రీధర్‌రెడ్డి హత్య కేసులో పోలీసులు లోతైన విచారణ చేపడుతున్నారు. మే 22న లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి తన ఇంటి సమీపంలో కళ్లం వద్ద నిద్రిస్తుండగా అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. అతని హత్య జరిగి రెండు నెలలు దాటినా మిస్టరీగా మారింది. హత్య కేసును చేధించడంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబ సభ్యులు డీజీపీకి ఫిర్యాదు చేసినా కూడా కేసు కొలిక్కి రాలేదు. గత నెలలో స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శ్రీధర్‌రెడ్డి హత్యపై స్పందించారు. ఈ కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితులను త్వరగా పట్టుకోవాలని ఆదేశించడంతో డీజీపీ ఆదేశాల మేరకు ఐజీ, డీఐజీ గతనెల 16వ తేదీన లక్ష్మీపల్లి గ్రామాన్ని సందర్శించి హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ నేపథ్యంలో కేసు విచారణ వేగవంతం చేశారు. అందులో భాగంగా శనివారం లక్ష్మీపల్లి గ్రామానికి చెందిన పలువురితో పాటు, మరికొందరిని పదుల సంఖ్యలో తెల్లవారుజాము నుంచే పోలీసులు అదుపులోకి తీసుకుని లోతైన విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ విషయంపై విచారణ అధికారితో పాటు ఉన్నతాధికారులను సంప్రదించేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదు. విచారణ నిమిత్తం తీసుకెళ్లిన వారి బాధిత కుటుంబ సభ్యులు పోలీసులు ఎక్కడికి తీసుకెళ్లారో కూడా సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నేడు దేవరకద్ర నియోజకవర్గంలో
మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటన

చిన్నచింతకుంట/మదనాపురం, ఆగస్టు 3 : దేవరకద్ర నియోజకవర్గంలో ఆదివారం మంత్రులు, ఎమ్మెల్యేల పర్యటన ఉంటుందని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, టూరిజం అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి, కార్యదర్శి సంపత్‌కుమార్, ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు తదితరులు ఆదివారం నియోజకవర్గంలో పర్యటించనున్నారని చెప్పారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దే ప్రయత్నంలో భాగంగా ఉదయం కురుమూర్తి వేంకటేశ్వరస్వామి ఆలయం, సరళాసాగర్, మధ్యాహ్నం కోయిల్‌సాగర్ ప్రాజెక్టులను సందర్శిస్తారని ఆయన తెలిపారు.

నేడు జిల్లా ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 3 : నిజామాబాద్ జిల్లాలో ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు జరగనున్న సీనియర్ మహిళల ఫుట్‌బాల్ రాష్ట్ర టోర్నీలో పాల్గొనే జిల్లా మహిళా జట్టు ఎంపికలను ఈనెల నాలుగో తేదీన జడ్చర్లలో నిర్వహించనున్నట్లు ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ భానుకిరణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి మినహా పూర్వ మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఉదయం తొమ్మిది గంటలకు జడ్చర్లలోని స్టేడియం మైదానానికి ఆధార్‌కార్డుతో హాజరు కావాలని ఆయన కోరారు.

చేనేత కార్మికులు బీమా పథకానికి అర్హులు

▸ నేతన్నలు ఈనెల 9లోపు పేర్లను నమోదు చేసుకోవాలి

మహబూబ్‌నగర్(కలెక్టరేట్), ఆగస్టు 3 : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమం కోసం నేతన్న బీమా పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం అందరికీ తెలిసిందే. ఈ పథకంలో (2024-25 సంవత్సరం) చేరేందుకు 18 ఏళ్లు నిండిన చేనేత లేదా మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులు అర్హులని చేనేత, జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకులు డి.బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు చేనేత వృత్తిలో కొనసాగుతూ కేవలం వృత్తిపై ఆధారపడి మాత్రమే జీవనం సాగిస్తుండాలని పేర్కొన్నారు. నేతన్నకు చేయూత కింద నమోదు కానివారు కూడా ఇందులో చేరవచ్చని సూచించారు. ఈ పథకంలో చేరేందుకు ఆధార్‌కార్డు ప్రకారం వయస్సు 18 ఏళ్లు నిండి ఉండాలని తెలిపారు. గత సంవత్సరం (2023-24)లో నమోదు అయిన చేనేత లేదా మరమగ్గాల కార్మికులు, అనుబంధ కార్మికులను యదావిధిగా 2024-25 సంవత్సరానికి కొనసాగించడం జరుగుతుందని తెలిపారు. పథకానికి అర్హత కలిగి ఉండి కొత్తగా చేరే సభ్యులు ఈనెల తొమ్మిదో తేదీలోపు చేనేత మరియు జౌళిశాఖ, సహాయ సంచాలకులు మహబూబ్‌నగర్ లేదా నారాయణపేట కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.







మాయమైన పాటు కాలువ

▸ దాదాపు 200 ఎకరాల సాగు రైతులకు అన్యాయం

▸ పట్టా భూమిలో ఉందంటున్న పట్టాదారుడు



ధ్వంసం చేసిన చెక్ డ్యాం

రేవల్లి, ఆగస్టు 3 : వనపర్తి జిల్లా ఏదుల మండలంలోని చీర్కపల్లి గ్రామానికి చెందిన నారాయణరావుకు నలుగురు కుమారులు వెంకటేశ్వరరావు, యాదగిరిరావు, మనోహర్‌రావు, రమేష్‌రావు ఉన్నారు. వీరు నలుగురు వారికి ఉన్న దాదాపు 27 ఎకరాల భూమిని హైదరాబాద్ నగరానికి చెందిన గోవర్ధన్‌రావుకు తక్కువ ధరకే అమ్ముకున్నారు. గోవర్ధన్‌రావు ఆ పట్టా భూమిని, అందులో గల పాటు కాలువను, కాలువపై గల మూడు చెక్‌డ్యాంలను, సిమెంట్ కాలువలను, కాలువ వెంట ఉన్న ఈత చెట్లను ప్రభుత్వ భూమి నక్షాలో లేవని అన్నింటిని తొలగించాడు. అదే సమయంలో కొంతమంది రైతులు అడ్డుపడినప్పటికీ ఇది ప్రభుత్వ భూమి కాదని.. తన సొంత భూమి అని దీనిపై సర్వహక్కులు నాకే ఉంటాయని అందుకే తొలగించానని అన్నారు. అనంతరం ఆయన హైదరాబాద్ నగరానికి చెందిన కళ్యాణ్‌సాగర్ అనే వ్యక్తికి అధిక ధరకు అమ్ముకున్నాడు. ఈ విషయంపై గ్రామ రైతులు మాట్లాడుతూ గ్రామంలోని వ్యవసాయ భూమిలో పాటు కాలువను గోపాల్‌పేట్ సంస్థానం వారు ఎన్నో సంవత్సరాల క్రితం నిర్మించారని.. దానిపై ఉన్న చెక్‌డ్యామ్‌లను వాటర్‌షెడ్ పథకంలో ప్రభుత్వమే నిర్మించిందని, ఉపాధి హామీ పథకం, మిషన్ కాకతీయ పథకం ద్వారా కూలీలతో పనులు చేయించామని, ప్రతీ సంవత్సరం కాలువను ప్రభుత్వమే బాగు చేస్తుందని అన్నారు. ఈ కాలువ ద్వారా గ్రామంలో గల ఊరకుంటకు నీళ్లు వస్తాయని కాలువ తొలగించడంతో సాగునీరు అందదని రైతులు వాపోయారు. కాలువ ఉంటే బావులకు, బోర్లకు నీళ్లు వస్తుండేవని ఈ కాలువను మళ్లీ పునరుద్ధరించాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి, నీటి పారుదల శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు. వర్షపు నీటితో పారే కాలువ కనుక రైతుల బాధలు అర్థం చేసుకొని కాలువను పునరుద్ధరించాలని వారు కోరారు. తమ వినతికి ఎమ్మెల్యే మేఘారెడ్డి సానుకూలంగా స్పందించారని, విచారణ అనంతరం ఇబ్బంది లేకుండా కాలువను పునరుద్ధరిస్తామని చెప్పినట్లు రైతులు తెలిపారు.

ఈ విషయంపై ఏదుల మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌ను కలువగా పాటు కాలువ ఉన్న మాట వాస్తవమేనని.. కానీ నక్షలో ఈ కాలువ లేదని అన్నారు. ఇదే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

▸ మరొకరికి తీవ్ర గాయాలు



సాయిరెడ్డి (ఫైల్)

కొత్తకోట, ఆగస్టు 3 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణ సమీపంలోని జాతీయ రహదారి మదర్‌థెరిస్సా జంక్షన్‌లో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిరెడ్డిలు ద్విచక్ర వాహనంపై జంక్షన్ గుండా కొత్తకోటకు వస్తుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఢీకొని ఆపకుండ వెళ్లిపోయాడు. మరో ద్విచక్ర వాహనంపై వెనకాలే వస్తున్న బంధువులు తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా సాయిరెడ్డి(83) మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొని వ్యక్తికి గాయాలు

కల్వకుర్తి టౌన్ : ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వ్యక్తి అతివేగంతో ఆర్టీసీ బస్సును ఢీకొని గాయాలపాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని సిల్వర్‌జూబ్లీ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన యాదయ్య కల్వకుర్తిలోని తన బంధువుల ఇంటికి వచ్చి బైక్‌పై తిరుగుప్రయాణమయ్యాడు. వెనుక నుంచి వస్తున్న బస్సుకు సైడివ్వకుండా నిర్లక్ష్యంగా బైక్‌ను నడుపుతూ దానిని ఢీకొన్నాడు. బస్ డ్రైవర్ సడన్‌బ్రేక్ వేయడంతో అతనికి గాయాలయ్యాయి. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన యాదయ్యను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బ్యాంకు ప్రైవేటు ఉద్యోగి అక్రమాలు

▸ పలువురికి కుచ్చుటోపీ

▸ రూ. 14 లక్షల 50 వేలు స్వాహా



బిజినెస్ కరస్పాండెంట్ దేవేందర్‌తో మాట్లాడుతున్న ఖాతాదారులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 3 : బ్యాంక్‌ను నమ్మి వచ్చే ఖాతాదారులను పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో బిజినెస్ కరస్పాండెంట్(గోల్డ్, ఇతర లోన్లు ఇప్పించే ఉద్యోగి)గా విధులు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి అక్రమాలతో పలువురు మోసపోయారు. ఆ వ్యక్తి పలువురికి కుచ్చుటోపీ పెట్టి రూ.14 లక్షల 50 వేలను స్వాహా చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటనపై పలువురు బాధితులు పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా పలు అక్రమాలకు పాల్పడిన బిజినెస్ కరస్పాండెంట్ బాగోతం బయట పడింది. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

పెద్దకొత్తపల్లి మండలం చిన్నకొత్తపల్లి గ్రామానికి చెందిన దేవేందర్ గత రెండేళ్లుగా పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు అనుసంధానంగా బిజినెస్ కరస్పాండెంట్‌గా విధులు నిర్వహిస్తూ వచ్చాడు. చిన్నకార్పాముల, లింగాల మండలం రాయవరం లొకేషన్లలో ఖాతాదారులు జన్‌ధన్ అకౌంట్లు, ఇన్సూరెన్స్ కోసం డబ్బులు కట్టించుకోవడం, ఈకేవైసీ అప్‌డేట్ చేయాల్సి ఉంది. నిబంధనలకు విరుద్ధంగా అక్కడ కాకుండా పెద్దకార్పాముల పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో తిష్ట వేసి బిజినెస్ కరస్పాండెంట్‌గా దేవేందర్ పని చేస్తున్నాడు. బ్యాంక్ పరిధిలో ఉన్న వివిధ గ్రామాల ఖాతాదారులు తమ డబ్బులను తమ ఖాతాలో జమ చేయడానికి వచ్చిన వారివి, పాలసీదారులు రెన్యువల్ కోసం వచ్చిన వారి డబ్బులను జమ చేయకుండా అందినకాడికి నొక్కేశాడు. అయితే పెద్దకొత్తపల్లిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో పని చేస్తున్న రమేష్ అనే వ్యక్తి 69వేలు ఫోన్ పే ద్వారా దేవేందర్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. అట్టి డబ్బు బ్యాంక్ ద్వారా డ్రా చేసి ఇవ్వమని అడగడంతో ఆ డబ్బులు డ్రా చేసుకుని రమేష్‌కు ఇవ్వలేదు. తన డబ్బులు తనకు ఇవ్వాలని బాధితుడు గట్టిగా మందలిస్తూ వచ్చాడు. ఆదేవిధంగా లింగాల మండలం అంబటిపల్లి గ్రామానికి చెందిన దేశెట్టి సతీష్ 15రోజుల క్రితం పీఎన్‌బీ బ్యాంక్‌లో 38.9గ్రాముల బంగారు నగలను బ్యాంకులో పెట్టి గోల్డ్‌లోన్ కావాలని దేవేందర్‌ను అడిగాడు. దీనికి గాను అతడు 84వేల రూపాయలు మాత్రమే సతీష్‌కు చెల్లించి మిగతా రావాల్సిన లక్ష రూపాయలు నొక్కేశాడు. శనివారం పెద్దకార్పాముల గ్రామంలో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు వెళ్లి బ్యాంక్ అధికారులను సతీష్ అడిగి తెలుసుకున్నారు. దీనికి కేవలం 84 వేల రూపాయలు మాత్రమే డబ్బులు దేవేందర్ ఇచ్చాడని, మిగతా లక్ష రూపాయలు ఇవ్వలేదని ఖరాఖండిగా బ్యాంక్ అధికారులను అడిగాడు. దీంతో డబ్బులు డ్రా చేసుకున్న దేవేందర్‌తో సతీష్ వాగ్వాదానికి దిగాడు. ఫలితం లేకపోవడంతో పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. దేవేందర్ తన సొంత అవసరాల కోసం ఖాతాదారులను అడిగి వారి ఖాతాల నుంచి వాడుకున్నానని ఒప్పుకున్నాడు. ఈ విషయంపై ఎస్‌ఐ సతీష్‌ను అడగగా ఖాతాదారుల నుంచి తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, ఖాతాదారులు ఫిర్యాదు చేస్తే బాధితునిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



వేముల గ్రామంలో చోరీ జరిగిన ఇంట్లో బీరువాను పరిశీలిస్తున్న క్లూస్‌టీం సిబ్బంది

మూసాపేట, ఆగస్టు 3 : మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామంలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఎస్సై శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉండ్యాల శేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇంట్లో ఉంటున్న తల్లిదండ్రులు గతనెల 25న ఇంటికి తాళం వేసి ఆసుపత్రిలో చూపించుకునేందుకు గాను హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. శనివారం ఇంటి ముందు నివాసముంటున్న శ్రీకాంత్ ఇంటి తలుపులు విరగ్గొట్టి ఉన్నాయని శేఖర్‌రెడ్డికి సమాచారమందించాడు. దీంతో వేములకు చేరుకున్న శేఖర్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమందించాడు. జిల్లా కేంద్రం నుంచి వచ్చిన క్లూస్‌టీం వేలిముద్రలను సేకరించింది. ఇంట్లో బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, కొంత నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు శేఖర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వెల్కిచర్లలో...

భూత్పూర్ : మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం వెల్కిచర్ల గ్రామంలో గుర్తు తెలియని దొంగలు రెండు వేర్వేరు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఖాదరయ్య నాగర్‌కర్నూల్‌లో హోటల్‌ను నడిపిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ప్రతీరోజు వెల్కిచర్ల గ్రామం నుంచి భార్యతో కలిసి నాగర్‌కర్నూల్‌లోని హోటల్‌కు వెళ్లి రాత్రికి ఇంటికి వచ్చేవారు. ఈనెల రెండో తేదీన ఖాదరయ్య, అతని భార్య గ్రామానికి రావడం ఆలస్యం కావడంతో నాగర్‌కర్నూల్‌లోనే ఉండిపోయారు. ఇంటి వద్ద కుమారుడు శివరాం ఒక్కడే ఉండడంతో పక్కన తమ్ముడి ఇంట్లో నిద్రించమని వారు సూచించారు. శనివారం తెల్లవారుజామున ఇంటికి వెళ్లిన శివరాం తాళం విరగ్గొట్టి ఉండడంతో తల్లిదండ్రులకు సమాచారమందించాడు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రూ.50వేల నగదును దొంగలు దోచుకెళ్లారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన ఎరుకల కుర్మయ్య ఇంట్లో దొంగలు తాళం విరగ్గొట్టి బీరువాలో ఉన్న నాలుగు గ్రాముల బంగారు కమ్మలు, 30 తులాల వెండి దీపాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హ్యాండ్‌బాల్ స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికైన విద్యార్థికి సన్మానం



విద్యార్థి విజయ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జడ్చర్ల, ఆగస్టు 3 : హ్యాండ్‌బాల్ స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికైన జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి విజయ్‌ను శనివారం పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. గతనెల 13న వరంగల్ జిల్లా హనుమకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో ప్రతిభ కనబరిచి స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికయ్యాడని హెచ్‌ఎం శ్రీనివాస్ తెలిపారు. పాఠశాల ఆవరణలో పీఈటీ శంకర్‌నాయక్, రవికుమార్‌గౌడ్, అశోక్‌లు విద్యార్థిని సన్మానించారు.

గూడ్స్ రైలు ఢీకొని రైతు మృతి

మక్తల్, ఆగస్టు 3 : గూడ్స్ రైలు ఢీకొని యువ రైతు మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్‌అక్బర్ తెలిపిన వివరాల ప్రకారం.. మక్తల్ పట్టణానికి చెందిన రైతు దంతలూరి కురుమయ్య(47) వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబ పోషణ చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన అనంతరం పొలానికి వెళ్లాడు. పొలం వద్ద రైలు పట్టాలు దాటే క్రమంలో గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం ఉదయం భర్త ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన భార్య పార్వతమ్మ పొలానికి వెళ్లి చూడగా రైలు పట్టాల వద్ద కురుమయ్య మృతదేహం కన్పించింది. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి పరిశీలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.

కేఎల్ఐ కాలువలో పడి మహిళ ఆత్మహత్య



కడారి నీలమ్మ (ఫైల్)

బిజినేపల్లి, ఆగస్టు 3 : పత్తి చేనుకు పురుగుల మందు పిచికారి చేసిన రాత్రి వర్షం కురవడంతో స్ప్రే చేసిన మందు వృథా అయ్యిందని భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. మనస్తాపం చెందిన భార్య కేఎల్ఐ కాలువలోకి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వెల్గొండ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కడారి ఎల్లయ్య, నీలమ్మ(50) భార్యాభర్తలు. గురువారం వీరికున్న వ్యవసాయ పొలంలో కుమారుడు శివతో కలిసి ముగ్గురూ పత్తి పంటకు పురుగుల మందు పిచికారి చేసి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చారు. వెంటనే వర్షం పడి పిచికారి చేసిన మందు వృథా అయ్యింది. దీంతో నీలమ్మ భర్త, కుమారుడితో గొడవ పడింది. ఆపై మనస్తాపం చెందిన ఆమె గ్రామ సమీపంలోని కేఎల్ఐ కాలువలోకి దూకి ఆత్మహత్యకు ఒడిగట్టింది. శనివారం ఉదయం వట్టెం సమీపంలోని కేఎల్ఐ కాలువలో గుర్తు తెలియని మహిళ శవం తేలిందని పోలీసులకు సమాచారం రావడంతో శవాన్ని బయటకు తీసి పరిశీలించి, నీలమ్మగా గుర్తించి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి కుమారుడు కడారి శివ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నీటి కుంటలో పడి వృద్ధుడి మృతి

వెల్దండ, ఆగస్టు 3 : ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి మతిస్థిమితం లేని వృద్ధుడు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం రాచూరు గ్రామ సమీపంలో జరిగింది. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి పట్టణంలోని బాల్‌రాంనగర్‌కు చెందిన ఎండీ నిరంజన్(67) గత కొన్నేళ్లుగా మతిస్థిమితం లేకుండా ఉన్నాడు. ఈ క్రమంలో గతనెల 25న నిరంజన్ ఎవరికీ చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు అతని ఆచూకీ కోసం వెతికారు. వృద్ధుడి జాడ కానరాకపోవడంతో మరుసటి రోజు కల్వకుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, శనివారం రాచూరు గ్రామ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న నీటికుంటలో నిరంజన్ మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గమనించారు. తమకు సమాచారం ఇవ్వడంతో మృతిచెందిన వృద్ధుడు నిరంజన్‌గా నిర్ధారించి పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడు అన్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ఉండవల్లి, ఆగస్టు 3 : కారు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాసులునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుర్వ చెట్టుకింది సవారన్న(70) గతనెల 27న ఉండవల్లి జడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో కారు ప్రమాదానికి గురయ్యాడు. గాయపడిన సవారన్నను చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సవారన్న శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ప్రమాదానికి కారణమైన సత్యనారాయణపై మృతుడి భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

మాగనూరు, ఆగస్టు 3 : నారాయణపేట జిల్లా కృష్ణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుడెబల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్సై నవీద్ తెలిపిన వివరాల ప్రకారం.. మృతి చెందిన వ్యక్తి మెడ, గొంతుపై బలమైన కత్తిపోటు గాయం ఉంది. వ్యక్తి హత్య అనంతరం నదిలో మృతదేహాన్ని పారవేయడానికి వచ్చి జనం, వాహనాల రాకపోకల కారణంగా బ్రిడ్జిపై పడేసి వెళ్లినట్లు ఆనవాళ్లను బట్టి తెలుస్తుందన్నారు. గుర్తుతెలియని వ్యక్తి వయస్సు 35 సంవత్సరాలుగా ఉంటుందని, మెడలో దారం ఉన్నట్లు చెప్పారు. పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పట్టపగలు చోరీ

▸ రెండున్నర తులాల బంగారు ఆభరణాల అపహరణ

నారాయణపేట, ఆగస్టు 3 : నారాయణపేట జిల్లా ప్రధాన రహదారి జన సంచార ప్రాంతంలో గొడుగుగేరి ఆంజనేయస్వామి దేవాలయ సమీపంలో శనివారం మధ్యాహ్నం వైద్యశాఖ రిటైర్డ్ ఉద్యోగి పళ్ళ బస్వరాజ్‌కు చెందిన రెండున్నర తులాల రెండు బంగారు ఉంగరాలు, గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుని వెళ్లారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బస్వరాజ్ శనివారం పట్టణంలోని ఎస్‌బీఐలో తన ఖాతా నుంచి రిటైర్మెంట్ పింఛన్ రూ.50 వేలను తీసుకొని కాలినడకన సెంటర్ చౌక్‌వైపు వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వెంబడించి మెయిన్‌రోడ్డుపై ఆపారు. వయోభారమైన మీరు బంగారం ఉంగరాలు, చైన్ వేసుకుని ఎందుకు వెళ్తున్నారు.. వాటిని తీసి కవర్‌లో పెట్టుకోమని, తాము స్పెషల్ పార్టీ పోలీసులమని చెప్పారు. నమ్మిన ఆయన ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు తీసివేశాడు. వ్యక్తులు అందించిన కవర్‌లో ఉంచుకోమని మరో కవర్‌ను ఆయనకిచ్చి బంగారు కవర్‌ను పట్టుకొని బైక్‌పై ఉడాయించారు. పట్టపగలు తనకు జరిగిన మోసాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. అందరు చూస్తుండగానే కనికట్టుగా జరిగిన చోరీతో బస్వరాజ్ ఆందోళనకు గురయ్యారు.

పోలీసుల అదుపులో దొంగల ముఠా

కోస్గి, ఆగస్టు 3 : నారాయణపేట జిల్లా కోస్గి పోలీసులు ఓ దొంగల ముఠాను పట్టుకున్నారు. ఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం సాయంత్రం ఇద్దరు వ్యక్తులకు చెందిన రెండు మొబైల్ ఫోన్లు అపహరణకు గురయ్యాయని వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం తమ సిబ్బందిని మఫ్టీలో బస్టాండ్‌లో ఉంచామన్నారు. బస్టాండ్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరిని స్థానికుల సమాచారంతో పట్టుకున్నామన్నారు. పట్టుబడిన ఇద్దరు బేతంచర్లకు చెందిన వారని తెలిపారు. వీరు బస్టాండ్లలో, రద్దీగా ఉండే ప్రదేశాల్లో దొంగతనాలు చేస్తుంటారని చెప్పారు. వీరి నుంచి కొన్ని సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకొని విచారిస్తున్నామన్నారు. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 41 మందికి రూ.82 వేలు జరిమానా

మహబూబ్‌నగర్, ఆగస్టు 3 : డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 41 మందికి రూ.82 వేలు జరిమానా విధించారు. పట్టుబడిన వారిని కోర్టులో ప్రవేశపెట్టగా ఒక్కొక్కరికి రూ.రెండు వేల చొప్పున మూడో జేఎఫ్‌సీఎం నిహారి శనివారం జరిమానా విధించారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన వారికి ఎస్పీ జానకి ఆదేశాల మేరకు ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇకపై నిరంతరంగా తనిఖీలు చేస్తామన్నారు. తాగి వాహనాలు నడపడం నేరమని, మరోసారి పట్టుబడితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

నిజాయతీని చాటుకున్న హోంగార్డు



మొబైల్‌ను అందజేస్తున్న ట్రాఫిక్ ఎస్సై, హోంగార్డు

గద్వాల క్రైం, ఆగస్టు 3 : సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి సెల్‌ఫోన్ అందించి గద్వాల హోంగార్డు తన నిజాయతీని చాటుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని రాజీవ్‌మార్గ్‌లో హోంగార్డు విష్ణు విధులు నిర్వహిస్తున్న సమయంలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి తన మొబైల్ అనుకోకుండా ఆ వ్యక్తి ప్యాంట్ వెనుక జేబులో నుంచి జారి కింద పడింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న విష్ణు ఆ మొబైల్‌ను తీసుకొని ట్రాఫిక్ కార్యాలయంలో ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడికి అప్పగించారు. జమ్మిచేడుకు చెందిన పోగొట్టుకున్న ఆ వ్యక్తి తన మొబైల్‌కు కాల్ చేయడంతో ట్రాఫిక్ కార్యాలయం వద్దకు రావాలని సూచించారు. అంతేకాకుండా ఆ మొబైల్‌కు సంబంధించి బాక్స్, ఇన్సూరెన్స్ పత్రాలు చూపించడంతో పోగొట్టుకున్న వ్యక్తిదే అని నిర్ధారించుకొని ట్రాఫిక్ ఎస్సై బాలచంద్రుడు చేతుల మీదుగా అతనికి మొబైల్‌ను అందజేశారు. నిజాయతీని చాటుకున్న హోంగార్డు విష్ణును ట్రాఫిక్ ఎస్సై అభినందించారు. బాధితుడు ట్రాఫిక్ ఎస్సై, హోంగార్డుకు కృతజ్ఞతలు తెలిపారు.

అసైన్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేయాలి

- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న



అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

తాడూరు, ఆగస్టు 3 : కాంగ్రెస్ ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి మోఖాపై ఉన్న రైతులకు అసైన్‌మెంట్ పట్టాలిచ్చి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. తాడూరు మండల పరిధిలోని గుంతకోడూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ముందు దళితులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న మాట్లాడుతూ గుంతకోడూరు గ్రామంలో 20మంది దళితులకు అసైన్‌మెంట్ పట్టా సర్టిఫికెట్ ప్రభుత్వం 1998లో టీడీపీ ప్రభుత్వంలో అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి పట్టా సర్టిఫికెట్లు ఇచ్చిందని, అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వ రికార్డుల్లో ఎక్కించకుండా దళితులు ఎమ్మార్వో కార్యాలయం, అధికారుల చుట్టూ తిరగడం తప్ప ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. దీన్ని వెంటనే రికార్డుల్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని గ్రామాల్లో దాదాపు 100ఎకరాల్లో అసైన్‌మెంట్ భూమి ఉందని, గత 15 సంవత్సరాల క్రితం అసైన్‌మెంట్ కమిటీ ఏర్పాటు చేసి ఇప్పటి వరకు చాలా మంది దళితులు బీసీలు బలహీన వర్గాలు ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటూ రికార్డుల్లో ఎంట్రీ లేకపోవడంతో ప్రభుత్వం ఇస్తున్న సాయం రుణమాఫీ రైతుబంధు, రైతుబీమా, బ్యాంక్‌లోన్ అందడం లేదన్నారు. దీన్ని వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అసైన్‌మెంట్ కమిటీని ఏర్పాటు చేసి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అంతటి మన్యం, అంతటి చంద్రయ్య, ఆటో పరశురాములు, సైదులు, శ్యామ్, రామకృష్ణ, బంగారయ్య, నరసింహ, మల్లేష్ పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ తీర్పు చరిత్రాత్మకం

- ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ



వర్గీకరణ విజయం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్‌మాదిగ

కొల్లాపూర్, ఆగస్టు 3 : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో 30 సంవత్సరాల పాటు అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన ఎస్సీ వర్గీకరణ సాధించామని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్రమోని యాదగిరి మాదిగలు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పీజీ సెంటర్‌లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమని హర్షం వ్యక్తం చేస్తూ వర్గీకరణ విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్ర పటాలకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కోళ్ల శివమాదిగ, ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్ మాదిగలు మాట్లాడారు. పీజీ కళాశాల అధ్యాపకులు రవీంద్రనాథ్, సురేందర్, దేవరాజు, సంతోష్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఎస్ఎఫ్ నాయకులు పుట్టపాగ రాము, శీలం అగ్రస్వామి, సులిగిరి శ్రీనివాస్, మిద్దె కృష్ణయ్య, పరశురామ్, మీసాల నాగరాజు, రమేష్, దేవరాజ్ పాల్గొన్నారు.

'ముఖ్యమంత్రి మాటలను ఉపసంహరించుకోవాలి'

అచ్చంపేటటౌన్, ఆగస్టు 3: ప్రైవేటు ఉపాధ్యాయులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్న మాటలను ఉపసహరించుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవి నాయక్ అన్నారు. పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రైవేటు ఉపాధ్యాయులపై చేసిన వ్యాఖ్యలను ఉపసహరించుకోవాలని శనివారం పట్టణంలోని టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రైవేటు ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఫీజీలు చేసి చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్న ప్రైవేటు ఉపాధ్యాయులను ఇలా వ్యాఖ్యానించడం సరి కాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటలను వెంటనే ఉపసహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయ సంఘం నాయకులు మహేష్, ఉషన్న, రమేష్, పర్వతాలు, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

రాజీ మార్గం ద్వారానే పరిష్కరించుకోండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్‌బాబు



కో ఆర్డినేషన్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 3 : జాతీయ మూడవ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజేష్‌బాబు అన్నారు. శనివారం జిల్లా కోర్టు ఆవరణలో పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ, వైద్యారోగ్య తదితర శాఖలతోపాటు బార్ అసోసియేషన్ సభ్యులతో కో ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఆగస్టు 14న నిర్వహించే మూడవ జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలన్నారు. సీనియర్ సెల్ న్యాయాధికారి సబిత, న్యాయాధికారులు శ్రీనిధి, మౌనిక, మమతారెడ్డి, అదనపు ఎస్పీ రామేశ్వర్, కలెక్టర్ ఏవో చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులు, పోలీసులు, ఎక్సైజ్, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


'తెలుగు విశ్వ విద్యాలయానికి ఆ పేరునే కొనసాగించాలి'

మన్ననూర్, ఆగస్టు 3: తెలుగు విశ్వవిద్యాయలానికి అమర జీవి పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా కొనసాగించాలని ఆర్యవైశ్య మహాసభ రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సంభు వెంకట్‌రమణలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగు భాషా రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు కృషి విలువైనదన్నారు. ఆయన పేరును మార్చి తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాప్ రెడ్డి పేరును పెట్టాలని ఇటీవల మంత్రివర్గం ప్రతిపాదించిందని, నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. ఈ విషయమై సంఘం తరపున ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఎమ్మెల్సీ గోరటి వెంకన్న చిత్రపటానికి క్షీరాభిషేకం

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 3: ప్రజా గాయకుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న చిత్రపటానికి శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ మాలమహానాడు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన గోరటి వెంకన్న చిత్ర పటానికి మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి క్షీరాభిషేకం చేసిన అనంతరం శాసనమండలిలో ఎమ్మెల్సీ ప్రసంగాన్ని హర్షిస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చింత సత్తి మాట్లాడుతూ మాల జాతి ముద్దుబిడ్డ ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అని కొనియాడారు. మాలమహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి గాజుల భాస్కర్, అధికార ప్రతినిధి సామ మహేష్, జిల్లా నాయకులు చంద్రయ్య, కర్నె రాజేంద్రప్రసాద్, మధు, శేఖర్, చిన్నయ్య, రమేష్, మధు, చెన్నయ్య, జగదీష్, ప్రవీణ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలి



కమిషనర్ అశ్రిత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సైదులుయాదవ్, శేఖర్, ఖాదర్

కల్వకుర్తిటౌన్, ఆగస్టు 3 : అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్‌కు శనివారం సైదులుయాదవ్, పరుషపాకుల శేఖర్, ఖాదర్‌లు ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని సాయిబాలాజీ ఫంక్షన్‌హాల్ వెనక సర్వే నెంబర్ 746 బై 1లో చేసిన వెంచర్‌కు ఎలాంటి అనుమతులు లేవని, పాట్లరాళ్ల తొలగించిన వెంటనే మళ్లీ పాతుతున్నారని, అట్టి వ్యక్తులపై మునిసిపల్ కమిషనర్ చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు వినతి పత్రంలో కోరారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులు త్వరగా పరిష్కరించండి

- కలెక్టర్ బదావత్ సంతోష్



రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి సీసీఎల్ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ధరణి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ శనివారం జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో కలెక్టర్, అదనపు కలెక్టర్ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను రానున్న వారం రోజుల్లో క్లియర్ చేయనున్నట్లు వీడియో కాన్ఫరెన్స్‌లో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శికి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ధరణి దరఖాస్తులను వేగవంతంగా క్లియర్ చేయాలని ఆదేశించారు. పరిష్కరించిన ప్రతీ దరఖాస్తుకు ప్రొసీడింగ్ ఆర్డర్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, తిరస్కరిస్తే ఎందుకు రిజెక్ట్ చేశారో తెలుపుతూ రిమార్కులను నమోదు చేయాలని ఆదేశించారు. వాటి పరిష్కారానికి అవసరమైన రిపోర్టులు అప్‌లోడ్ చేసేందుకు ప్రత్యేక లాగిన్‌లో నమోదు చేయాలన్నారు. మండలాల వారిగా పెండింగ్ దరఖాస్తులను రివ్యూ చేసుకోవాలని, అధికంగా పెండింగ్ ఉన్న మండలాలపై ఆర్డీవోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వారం రోజుల్లో పెండింగ్ దరఖాస్తులన్ని పరిశీలించి జీరో స్టేజ్‌కు తీసుకురావాలని గడువు విధించారు. అదనపు కలెక్టర్ సీతారామారావు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలి

స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఒక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళా సంఘాల ప్రతినిధులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద మొత్తంలో పాల్గొనాలని పేర్కొన్నారు. తమ యొక్క గ్రామాన్ని, పట్టణాల్లో స్వచ్ఛత ను పెంపొందించాలని, పచ్చదనం వెల్లి విరిసేలా చూడా లని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లో ప్రతి పట్టణ వార్డుల్లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం ఈ నెల 5న ప్రారంభమవుతుందని, స్థానిక నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, యువకులు, వార్డు కమిటీ సభ్యులతో ర్యాలీ నిర్వహించి సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి సారించాలని, ఇంటి స్థాయి లో చెత్తను వేరు చేయడంపై దృష్టి సారించాలని తెలిపారు. 6వ తేదీన తాగునీటని సరఫరా, ఇంకుడు గుంతల నిర్మాణం, రెండవ రోజులో భాగంగా గ్రామాలల్లో, పట్టణాల్లో తాగునీరు, వర్షపు నీరు సంరక్షణ కొరకు చేపట్టాల్సిన కార్యక్రమాలలో భాగంగా అన్ని తాగునీటి వనరులు, డీన్ చేయబడాలని ప్రతిరోజు క్లోరినేషన్ చేయాలని పేర్కొన్నారు. ఆగస్టు 7న మురికి కాల్వలను, నీటి నిల్వ ప్రాంతాలను శుభ్రం చేయడం, గుంతలను పూడ్చడం తదితర కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆగస్టు 8న సీజనల్ వ్యాధుల నియంత్రణపై అవగాహన వీధి కుక్కల దాడుల నివారణ చర్యలు, నాల్గవ రోజులో భాగంగా గ్రామాల్లో, పట్టణాల్లో చేపట్టాల్సిన కార్యక్రమాల్లో భాగంగా ఆరోగ్యం, వీధి కుక్కల బెడదపై దృష్టి పెట్టాలన్నారు. ఆగస్టు 9న ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ స్థలాలను శుభ్రపర్చడం, గ్రామపంచాయతీల్లో అన్ని కుటుంబాలు, శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. శిథిలమైన భవనాలు, గోడలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. ముఖ్యంగా మొక్కలు నాటడం, అటవీ చెంచు ప్రాంతాల్లో, అడవి జంతువులకు ఉపయోగపడే చిన్నపాటి అటవీ ఉత్పత్తి జాతులను పెంచాలన్నారు. ఈ మార్గదర్శకాలను కార్యదర్శులందరూ పాటించేలా అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో సీఈవోలు, జడ్పీ, డీఆర్‌డీవోలు, డీపీవోలు, మునిసిపల్ కమిషనర్లు జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలను పర్యవేక్షిస్తారన్నారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

-ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి



కల్వకుర్తిలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి

కల్వకుర్తి, ఆగస్టు 3 : తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మొదటి అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మావతి హాజరై ప్రసంగించారు. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇస్తే బిడ్డకు జీర్ణవ్యవస్థ సంపూర్ణంగా పని చేయడంతో పాటు గుండెజబ్బులు, క్యాన్సర్, డయేరియా, శ్వాసకోశ వ్యాధులు, ఎలర్జీ దరిచేరవని పేర్కొన్నారు. తల్లులు పిల్లల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని పద్మావతి సూచించారు. డాక్టర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు నిర్మల, అరుణ, జ్యోతి, ఆయాలు ధనమ్మ, నీలమ్మ, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: శిశువు పుట్టినప్పటి నుంచే తల్లిపాలు పట్టించడం ఎంతో శ్రేయస్కరమని తల్లిపాల వారోత్సవాల ప్రత్యేక ప్రోగ్రాం అధికారి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని మంగనూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల ప్రాముఖ్యతపై, తల్లి, గర్భవతులు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను ఆయన వివరించారు. అలాగే ప్రభుత్వం చిన్నారులకు పంపిణీ చేస్తున్న టీకాలను క్రమం తప్పకుండా ఇప్పించాలని సూచించారు. గ్రామాల్లో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్య సేవలు, మందులు అందించి ఉత్తమ ఆరోగ్య కేంద్రంగా జిల్లాలో ముందుండాలని అన్నారు. ఆయన వెంట జిల్లా టీకాల అధికారి డాక్టర్ రవికుమార్ నాయక్, డాక్టర్ కృష్ణమోహన్, వైద్య సిబ్బంది శశికళ, బాలమణి, తాళ్ల యాదగిరి, జ్యోతి, అంగన్‌వాడీ సిబ్బంది సుగుణ, మమత, బాలింతలు, గర్భవతులు ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలే ఆరోగ్యకరమైనవని అంగన్‌వాడీ టీచర్లు సులోచన, శ్రావణి, వరలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవుని తిర్మలాపూర్ 1, 2, 3 అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు ఒక గంటలోపు ముర్రుపాలు కచ్చితంగా బిడ్డకు పట్టించాలని వారు సూచించారు. తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయని వారు తల్లులకు వివరించారు. అలాగే బిడ్డలకు పాలు పట్టించే పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. అలాగే వెయ్యి గోల్డెన్ జట్టు గురించి వివరించారు.

● చారకొండ: మండల పరిధిలోని రాంచంద్రపూరంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ పూజ మాట్లాడుతూ తల్లిపాల ద్వారా బిడ్డకు రోగ నిరోధక శక్తి లభిస్తుందని అన్నారు. పంచాయతీ కార్యదర్శి పవన్, పాఠశాల ఉపాధ్యాయుడు మహమ్మద్‌పాషా, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

● అచ్చంపేటఅర్బన్: పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లులు వెంటనే ముర్రుపాలు పట్టించాలని ఐసీడీఎస్ సీడీపీవో దమయంతి అన్నారు. శనివారం మండల పరిధిలోని హాజీపూర్ సెక్టార్‌లోని హాజీపూర్ అంగన్‌వాడీ కేంద్రంతో పాటు హాజీపూర్ పరిధిలోని సూపర్‌వైజర్ స్వర్ణలత, అనిత పాల్గొన్నారు. అన్నప్రాసన నిర్వహించారు.

ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగిస్తున్నారు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ



సదస్సులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 3: నేటి రాజకీయ పార్టీలకు కార్మిక వర్గ దృక్పథం కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సింగిల్ విండో సమావేశ మందిరంలో ఏఐటీయూసీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కార్మికులకు రాజకీయ, ఆర్థిక, సామాజిక, కార్మిక చట్టాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముందుగా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డీ.యూసుఫ్ ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించి సభలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారీ దోపిడి వ్యవస్థకు ఆజ్యం పోస్తోందని అన్నారు. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్ పేరుతో రద్దు చేసిందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పోరేట్ బహుళ జాతి పెట్టుబడిదారులకు అప్పగించేందకు ఎర్ర తివాచీలు పరిచిందని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా కోటాను కోట్ల అసంఘటిత రంగ కార్మిక వర్గం కనీస వేతనాలకు నోచుకోక వెట్టిచాకిరికి గురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ మాట్లాడారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు తప్పెట కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, గద్వాల జిల్లా అధ్యక్షుడు బి.ఆంజనేయులు, వనపర్తి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీరాములు, మాసన్న, మహబూబ్‌నగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సురేష్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు సీహెచ్.కొండన్న, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యు లు హెచ్.ఆనంద్‌జీ, కేశవులుగౌడ్, ఏఐటీయూసీ నాయ కులు శ్రీహరి, వెంకటేష్, బాలపీరు, శ్రీనివాసులు, రమే ష్, రాము, నరసింహ, చెన్నయ్య, లక్ష్మీపతి, గోపాల్, వా సు, రఘు, గోపిచారి, రంగయ్య, మహేష్, పద్మ, వెంకట మ్మ, విజయలక్ష్మీ, సుజాత, మణెమ్మ, చంద్రమ్మ, పద్మ, అలివేల, లక్ష్మమ్మ, నాగలక్ష్మి, భార్గవి పాల్గొన్నారు.

నల్లమలను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుతాం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



విజేత జట్టుకు కప్‌ను ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే, ఎస్పీ

మన్ననూర్, ఆగస్టు 3: నల్లమల ప్రాంతాన్ని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరులోని గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఫ్రెండ్లీ వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతుల ప్రదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్ పాల్గొన్నారు. 9 జట్లు పోటీలలో ప్రాతినిధ్యం వహించగా పదర జట్టు విజేతగా, జ్యోత్యానాయక్ తండా జట్టు రన్నరప్ గా నిలిచాయి. బెస్ట్ ఆల్‌రౌండర్‌గా అజిత్ ఎంపికయ్యాడు. విజేతలకు కప్పులను, పోటీలో పాల్గొన్న క్రీడాకారులందరికీ సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ నల్లమల క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఆడడమే లక్ష్యంగా ఎంచుకోవాలన్నారు. మన్ననూరులోని గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాలలో కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేస్తున్నట్లు పకటించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, యువత డ్రగ్స్‌కు బానిసలుగా మారవద్దని, క్రీడల్లో ప్రాతినిధ్యం చేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. నల్లమలలో క్రీడల్లో ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నారని అన్నారు. త్వరలోనే జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంటును నిర్వహిస్తామన్నారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు, అచ్చంపేట, అమ్రాబాద్ సీఐలు రవీందర్, శంకర్, ఎస్ఐలు రమేష్, రాజు, పాఠశాల హెచ్ఎం సిద్దార్థ మహదేవ్, అమ్రాబాద్ మాజీ ఎంపీపీ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు హరినారాయణ, సంభు వెంకట్‌రమణ, బుచ్చయ్య, జూలూరి సత్యనారాయణ, మేరాజ్, లోకనాథం, రమణ గౌడ్, వెంకటయ్య పాల్గొన్నారు.

సేవలు చిరకాలం నిలిచిపోతాయి..

- జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటదాస్



ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటదాస్

తిమ్మాజిపేట, ఆగస్టు 3 : ప్రతీ ఉద్యోగికి బదిలీలు సాధారణమని.. మనం ప్రజలకు అందించే సేవలు మాత్రమే చిరకాలంగా నిలిచిపోతాయని జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటదాస్ అన్నారు. గత ఏడు సంవత్సరాలుగా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న గౌసోద్దీన్‌కు ఆవంచలో బాధ్యతలు స్వీకరించిన ఫార్మాసిస్టు బాలరాజుకు ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న మరో నలుగురు ఆరోగ్య సిబ్బందికి ఆవంచ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం బదిలీ ఉద్యోగులను పలువురు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. అదేవిధంగా గుమ్మకొండ ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు పూర్ణిమను, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, జీహెచ్‌ఎం సత్యనారాయణశెట్టి, పాఠశాల జీహెచ్‌ఎం శ్రీదేవి ఘనంగా సన్మానించారు. వైద్యాధికారులు డాక్టర్ స్వప్న, డాక్టర్ హరిప్రియ, డాక్టర్ కల్పన, డాక్టర్ ఇస్మాయిల్, డాక్టర్ రవినాయక్, వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

● తెలకపల్లి: ఉద్యోగులకు బదిలీలు అనేవి సర్వ సాధారణమని ఎక్కడ ఉన్నా తమ బాధ్యతను మరువకుండా ప్రజలకు సేవ చేయాలని మాజీ ఎంపీపీ బండ పర్వతాలు అన్నారు. శనివారం మండల పశువైద్యాధికారి డాక్టర్ నాగరాజుయాదవ్ గత 15 సంవత్సరాల నుంచి తెలకపల్లి మండల పశువైద్యాధికారిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. అదేవిధంగా నూతన పశువైద్యాధికారిగా వచ్చిన డాక్టర్ డి.మధుకు ఘనంగా స్వాగతం పలికారు. మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్లపల్లి యాదయ్యలు వారిని శాలువాతో సత్కరించారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులతో జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 3 : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపే లక్ష్యంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు పని చేయాలని జిల్లా విద్యాధికారి గోవిందరాజులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నాగర్‌కర్నూల్, తాడూరు తెల్కపల్లి మండలాల ఉన్నత పాఠశాలల భౌతికశాస్త్రం ఉపాధ్యాయులకు కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, కృష్ణారెడ్డి, రమేష్, భాస్కర్‌రావు, సుఖజీవన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జానపద కళాకారుల గ్రామ నూతన కమిటీ ఎన్నిక

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 3 : మండల పరిధిలోని మరికల్ గ్రామంలో జానపద కళాకారుల గ్రామ నూతన కమిటీని ఆ సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి తుపాకుల వెంకటేశ్, సహాయ కార్యదర్శి కాటేపాగ నరసింహులు ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడుగా కావలి చిన్న కోటయ్య, ప్రధాన కార్యదర్శిగా బీరం చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా దాసరి వెంకటస్వామి, కావలి నరేష్, కోశాధికారి కోల్లే ఈశ్వర్, సంయుక్త కార్యదర్శులు బొల్లె స్వామి, ఎరుకలి బిచ్చన్న, సహాయ కార్యదర్శులు పుట్ట లింగస్వామి, నక్క వెంకటయ్య ప్రచార కార్యదర్శి మారేడు యాదగిరితో పాటు కాటం శివలక్ష్మి, మనమోని అలివేల, మనమోని అనురాధ, పుట్ట కళావతి, పుట్ట రాముడు, తప్పెట ముత్యాలు, బొల్లెరాములు, కుర్మయ్య, మొగులాలు, జానీలను కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సలహాదారుడు తస్నీరు మల్లేష్, కార్యవర్గ సభ్యులు గడ్డం యాదగిరి, మండల ప్రధాన కార్యదర్శి బి.కేశవులు, సంయుక్త కార్యదర్శి ఊశన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న భక్తుడు



ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయానికి కోడె దూడను బహూకరిస్తున్న భక్తుడు

ఊర్కొండ, ఆగస్టు 3: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయానికి బిజినేపల్లి మండలం వసంతాపూరం గ్రామానికి చెందిన భక్తుడు పరశు రాములు కోడె దూడను బహూకరించారు. ఈ సందర్భంగా అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుడి నుంచి ఆలయ సిబ్బంది కోడె దూడను స్వీకరించారు. అర్చకులు మాట్లాడుతూ స్వామి వారు కోరిన కోరికలు తీరుస్తారని, భక్తుల కోరికలు తీరడంతో స్వామి వారికి మొక్కులు చెల్లించుకుంటారని పేర్కొన్నారు.

ఆలయ మాజీ చైర్మన్ నర్సిరెడ్డి, అర్చకులు దత్తాత్రేయ శర్మ, ప్రవీణ్‌శర్మ, సిబ్బంది శ్రీశైలం, వరలక్ష్మి, రవికుమార్, జంగయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

పెంట్లవెల్లి, ఆగస్టు 3: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ అన్నారు. శనివారం మండల పరిధిలోని కొండూరు గ్రామంలో రూ.40లక్షల నిధులు పాఠశాల అభివృద్ధి కోసం మంజూరు కావడంతో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ నల్లపోతుల గోపాల్, ప్రధానోపాధ్యాయుడు పొట్లపల్లి నాగరాజు, కాంగ్రెస్ నాయకులు భాస్కర్‌గౌడ్, పలుసరవి, విజయ్, ఖలీల్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

టీజీ రీజినల్ స్పోర్ట్స్ స్కూల్‌కు తెలకపల్లి విద్యార్థి ఎంపిక

తెలకపల్లి, ఆగస్టు 3 : మండల కేంద్రంలోని కేకేరెడ్డి స్కూల్‌ల్లో నాల్గవ తరగతి చదువుతున్న నవ్యశ్రీ అనే విద్యార్థిని టీజీ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎన్నికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ బాలు తెలిపారు. కరీంనగర్‌లో ఉన్న స్పోర్ట్స్ స్కూల్‌కు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

'రైతుబంధు నిధుల విడుదలలో జాప్యం'

కొల్లాపూర్, ఆగస్టు 3 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలమంది రైతులకు రైతుబంధు నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యం వహిస్తుందని బీఆర్ఎస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు డీకే.మాదిగ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతులకు రైతుబంధు లేదు కాని కొడంగల్ నియోజకవర్గానికి 4వేల 370కోట్ల రూపాయల నిధులు అభివృద్ధికి ముఖ్యమంత్రి మంజూరు చేశారని పేర్కొన్నారు. రైతుభరోసా కింద రైతులకు 15వేలు, కౌలు రైతులకు 15వేలు, వలస కూలీలకు 12వేలు వేస్తానన్న ముఖ్యమంత్రి దాని ఊసే ఎత్తడం లేదని ఆయన పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో, మునిసిపల్ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే రైతుబంధు పథకానికి బంద్ పెట్టి రైతు రుణమాఫీకే పరిమితం చేశారని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు మహేష్, వినయ్, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శనీశ్వర స్వామికి అభిషేకాలు

బిజినేపల్లి, ఆగస్టు 3 : మండలంలోని నందివడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో తిల, తైల అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్‌రా వు, వీరశేఖర్, ప్రభాకరాచారి, అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది ఉన్నారు.

గ్రామాల్లో మొక్కలు నాటాలి

కొల్లాపూర్, ఆగస్టు 3 : ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో మొక్కలు నాటాలని ఆర్డీవో నాగరాజు మండల అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులు పంచాయతీ కార్యదర్శులతో ఆర్డీవో సమావేశమయ్యారు. ఎంపీడీవో మనోహర్, మండల నోడల్ అధికారులు, తహసీల్దార్ విష్ణువర్ధన్, ఏపీడీపీవో అనంతలక్ష్మీ, గ్రామ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు హాజరయ్యారు.

టీసేఫ్ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 3 : టీసేఫ్ యాప్ గురించి ప్రతి బాలిక, మహిళలు అవగాహన కలిగి ఉండాలని షీటీం జిల్లా ఇన్‌చార్జి విజయలక్ష్మి అన్నారు. షీటీం ఆధ్వర్యంలో శనివారం నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థులకు టీసేఫ్ యాప్ గురించి అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు కుర్మయ్య, షీటీమ్ సభ్యులు వెంకటయ్య, భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ శ్రీలత పాల్గొన్నారు.

జడ్జిని నియమించాలని ఎమ్మెల్యేకు వినతి

అమ్రాబాద్, ఆగస్టు 3: భూసమస్యల పరిష్కారానికి ఆర్డీవో ఏజెన్సీ కోర్టు జడ్జిని నియమించాలని యురేనియం వ్యతిరేక జేఏసీ కన్వీనర్ కల్ముల నాసరయ్య శనివారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామీణ ప్రాంతంలోని భూతగాదాలు, సమస్యలు ఆర్డీవో కోర్టు ద్వారా పరిష్కారం కావడం లేదని పేర్కొన్నారు. ఆర్డీవో కోర్టులో ఆరు మాసాలకు ఒకసారి విచారణ నిర్వహిస్తున్న తరుణంలో ప్రత్యేక జడ్జి లేని కారణంగా భూసమస్యదారుల దస్త్రాలు ఏడాదైనా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. తమ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని అమ్రాబాద్, పదర మండలాల రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మల్లికార్జున్, బాలింగంగౌడ్, తిరుమలయ్య, రేణయ్య పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కోడేరు, ఆగస్టు 3: మండలంలోని పస్పుల గ్రామానికి చెందిన తెలుగు వెంకటయ్య అనే వ్యక్తి వ్యవసాయ పొలం దగ్గర సురమోని మల్లేష్, దేశమోని రామకృష్ణ, మరో కొంత మంది వ్యక్తులు శనివారం పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేసి వారి నుంచి రూ.1600 నగదు, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోకారి తెలిపారు. మేడిమాకుల కుర్మయ్య వడ్డె లక్ష్మయ్య, తుమ్మలి మధు పరారైనట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక వ్యాపారులపై కేసు నమోదు

కల్వకుర్తిటౌన్ ఆగస్టు 3 : ఇసుక అక్రమ రవాణ చేస్తున్న వారిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 16వతేదీన రాత్రి దుందుభీ వాగునుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ముగ్గురు నిందితులు మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన భాషమోని జాని, పోతరపల్లి పరుశరాములు, బూజుల భరత్‌రెడ్డి ఉన్నారు. వీరిలో ఈరోజు శనివారం భాషమోనిజానీ, పోతరపల్లి పరశురములును అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. న్యాయాధికారి జైలుశిక్ష విధించారని, బూజుల భరత్‌రెడ్డి అనే వ్యక్తి పరారీలో ఉన్నాడు.